క్లుప్తంగా

భగవద్గీత సర్వమానవాళికి మార్గదర్శకం



నగరం: శ్రీకృష్ణ పరమాత్మ బోధించిన భగవద్గీత ప్రతి ఒక్కరూ ఆచరించదగినదని టీటీడీ ఉపన్యాసకులు మరదాసు కోటేశ్వరరావు చెప్పారు. మండలంలోని పెద్దవరం గొడపాలెం రామ మందిరంలో తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. భగవద్గీత సర్వ మానవాళికి మార్గదర్శకమన్నారు. విద్యార్థులు భగవద్గీతను పఠనం చేయడం వల్ల జీవితంలో మంచి స్థాయిని పొందుతారన్నారు. అనంతరం భజన భక్త సమాజ బృందం వారు ఆలపించిన సంకీర్తనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అడవులదీవిలో ఉచిత పశు వైద్య శిబిరం



నిజాంపట్నం: మండలంలోని అడవులదీవి గ్రామ పశు వైద్యశాలలో శుక్రవారం బాపట్ల జిల్లా శ్రీసత్యసాయి సేవా సంస్థల గ్రామ సేవా విభాగం ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు వైద్య శిబిరాన్ని పశుసంవర్థక శాఖ రేపల్లె సహాయ సంచాలకులు నాంచారయ్య ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో కూచినపూడి పశు వైద్యాధికారి డాక్టర్ హేమప్రియ పలు పశువులకు వైద్యసేవలు అందించారు. పశువైద్య శాఖ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పున్నయ్య సహకారంతో పశు పోషకులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అదే విధంగా 100 మంది రైతులకు జామ, నిమ్మ మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా గ్రామ సేవా విభాగం ఇన్‌చార్జ్ తుమ్మల శ్రీనివాసరావు, సమన్వయకర్త గోవర్ధన్, సభ్యులు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

ఎంపీడీవో శ్రీనివాసరావు



కర్లపాలెం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య సిబ్బంది మెరుగైన సేవలందించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శుక్రవారం ఎంపీడీవో శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండాలని చెప్పారు. వైద్య సిబ్బంది రోగులతో మర్యాదగా మసలుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఘనంగా సత్యమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట



జీఎస్‌పాలెం(కర్లపాలెం): పిట్టలవాని పాలెం మండలం గోకరాజునల్లిబోయినవారిపాలెంలో శుక్రవారం అన్నం వారి ఇలవేల్పు సత్యమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్టా మహోత్సవంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పాల్గొని పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో నియోజకవర్గంలోని భక్తులు పాల్గొని పూజలు చేసి కానుకలు సమర్పించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాలు కిటకిట



తెనాలి: రాష్ట్రప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఆస్తి విలువను పెంపుదల చేయటంతో భూముల రిజిస్ట్రేషన్‌కు పలువురు శుక్రవారం రిజిస్ట్రేషను కార్యాలయాలకు బారులు దీరారు. దీంతో ఎక్కడికక్కడ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. తెనాలిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఉదయం నుంచి ప్రజలు చేరుకున్నారు. మరోవైపు అడపాదడపా సర్వర్లు మొరాయించాయి.

వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందేనా..!?

- అద్దె భవనంలో అరకొరగా వైద్యం
- నత్తనడకన అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం
- వినియోగంలోకి తీసుకురావాలంటూ ప్రజల విజ్ఞప్తి



నిర్మాణంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్

రేపల్లె రూరల్: పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం చేపట్టారు. కాగా ప్రస్తుతం దాని నిర్మాణం నత్తనడకన సాగుతోంది. నిర్మాణం పూర్తయి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి ఎప్పుడు వస్తాయా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. పట్టణంలోని వెనుకబడిన ప్రాంతాలలో మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఉప్పూడి రోడ్డులో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేసి భవన నిర్మాణం కొరకు కోటి రూపాయల నిధులు కేటాయించారు. 2021లో ప్రారంభమైన భవన నిర్మాణ పనులు ప్రారంభంలో గుత్తేదారుని నిర్లక్ష్యంతో పనులు కొంత నెమ్మదిగా సాగాయి. తరువాత పనులు ఊపందుకున్నాయి.

90 శాతం పైగా పనులు పూర్తి

ఎన్నికల సమయానికి అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణం పనులు 90 శాతంకు పైగా పూర్తయ్యాయి. ప్రస్తుతం భవనం కిటికీలకు గ్రిల్స్, తలుపులతో పాటు భవనం లోపల ఫ్లోరింగ్ పనులు, చుట్టూ కాంపౌండ్ వాల్, విద్యుత్, రంగుల పనులు చేయాల్సి ఉంది.

అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అర్బన్ హెల్త్ సెంటర్‌ను విస్మరించిందని పట్టణంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 90 శాతం పైగా నిర్మాణం పూర్తయిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను వినియోగంలోకి తీసుకువస్తే ఆ ప్రాంత వాసులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ వాసులు, ప్రజా సంఘాలు కోరుతున్నాయి. అయితే భవనం నిర్మాణంలో ఉండటంతో ప్రస్తుతం వైద్య సేవలు 13వ వార్డులోని అద్దె భవనంలో అరకొరగా అందిస్తున్నారు. అద్దె భవనంలో వైద్య సేవలు కొనసాగటం వల్ల వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించటం లేదని, నిత్యం అందుబాటులో ఉండటం లేదని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు.



అద్దె భవనంలో కొనసాగుతున్న అర్బన్ హెల్త్ సెంటర్

నిధులు మంజూరయ్యాయి

ఉప్పూడి రోడ్డులోని అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం 90 శాతం పూర్తయ్యింది. బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో గుత్తేదారుడు నిర్మాణం కొంత జాప్యం చేశాడు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే తలుపులు, కిటికీలు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించాం. భవనం లోపల ఫ్లోరింగ్‌తో పాటు రంగుల పనులు చేయాల్సి ఉంది. మరో రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి భవనం వినియోగంలోకి తీసుకువస్తాం.

– రోహిణి, మున్సిపల్ ఏఈ, రేపల్లె

నాటుసారా తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్



నాటుసారా తరలిస్తున్న మహిళను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ పోలీసులు

నగరం: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ శ్రీరామ్‌ప్రసాద్ చెప్పారు. మండలంలోని ఉల్లిపాలెంలో నాటుసారా తరలిస్తున్న మహిళను శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ మాట్లాడుతూ నాటుసారా తరలిస్తున్నారనే సమాచారంతో ఉల్లిపాలెంలో దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో 4.5 లీటర్ల నాటుసారా కలిగి ఉన్న మహిళను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నాటుసారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. గ్రామాలలో ఎక్కడైనా నాటుసారా తయారుచేస్తుంటే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఫ్రైడే - డ్రైడే కార్యక్రమం కొనసాగిస్తాం

కమిషనర్ జి.రఘునాథరెడ్డి



ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో ప్రదర్శన చేపట్టిన మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల: ప్రతి ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం కొనసాగిస్తామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని కారుమూడి హనుమంతరావుకాలనీలో ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చెత్త చెదారం తొలగించటంతోపాటు ప్రత్యేక ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ జి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ గృహ సముదాయాల చుట్టూ ఉన్న ఉపయోగంలేని వాటిని తొలగించాలని సూచించారు. వాడిపారేసిన కొబ్బరి బొండాలు, ఉపయోగంలో లేని కూలర్లు, నిలిచి ఉన్న నీరు, టైర్లలో, తొట్టెలలో, కుండీలలో ఉన్న నీటిని తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ కరుణ, రెడ్‌క్రాస్ నాయకులు బి.ఎస్.నారాయణభట్టు తదితరులు పాల్గొన్నారు.

గాయకుడు గద్దర్ జయంతి



అమర్తలూరు(వేమూరు): పీడిత ప్రజల పక్షాన నిలబడి పాటల ద్వారా చైతన్యం తెచ్చిన గద్దర్ చిరస్మరణీయుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన అమర్తలూరులో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో గద్దర్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి కామ్రేడ్ గర్నెపూడి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సామాజిక చైతన్యానికి జీవితాంతం పోరాడిన గద్దర్ ప్రజల హృదయాల్లో పదిలంగా ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గిరి, కట్టుపల్లి నాగరాజు, కొండమూరి సుబ్బారావు, షేక్ బురాని, వీరగంధం సుబ్బారావు, అవనగడ్డ అశోక్, గర్నెపూడి కోటేశ్వరరావు, జాషువా, పరిశుద్ధరావు, కట్టుపల్లి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

6న కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కుకు వేలం

రేపల్లె రూరల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని అరవపల్లి బాలకోటేశ్వరస్వామి తిరునాళ్లలో కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కును పొందుటకు ఈ నెల 6వ తేదీ ఉదయం 11.30 గంటలకు ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తుననట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దివి వెంకట అప్పలాచార్యులు శుక్ర వారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనదలచిన వారు రూ.3 వేలు డిపాజిట్ చెల్లించాలని, వేలం దేవదాయ, ధర్మాదాయ శాఖ నిబంధనలకు లోబడి నిర్వహించబడునని పేర్కొన్నారు. పూర్తి వివరాలకై ఆలయంలో సంప్రదించాలన్నారు.

పలువురు ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ



మాధవి దంపతులను సత్కరిస్తున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర

రేపల్లె రూరల్: మండలంలోని వడ్డీవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బి.మాధవి శుక్రవారం స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పాల్గొని ఆమె సేవలను కొనియాడారు. మాధవి దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే రేపల్లెలోని మున్సిపల్ హైస్కూలులో ఇంగ్లీష్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జి.నాంచారయ్య ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొని నాంచారయ్య సేవలను కొనియాడారు. నాంచారయ్య దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన



పొన్నూరు: ఉమ్మడి కృష్ణ, గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి ఫిబ్రవరి 27న జరిగే ఎన్నికలకు సంబంధించి నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్, మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే మార్గాల్లో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ అధికారులకు సూచించారు. మున్సిపల్ టీపీఓ రఘురామ్, రూరల్ సీఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఉదయం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు.

హామీలు నెరవేర్చకుంటే ప్రజాఉద్యమం

రాజధాని నిర్మాణం–రాష్ట్రాభివృద్ధి జాతలో సీపీఎం నేతలు



జాతకు స్వాగతం పలికిన స్థానిక నేతలు

తెనాలి: భారత కమ్యూనిస్ట్ పార్టీ 27వ మహాసభలు నెల్లూరులో జరుగనున్న సందర్భంగా తాడేపల్లి నుంచి నెల్లూరుకు వెళుతున్న సీపీఎం రాజధాని నిర్మాణం – రాష్ట్రాభివృద్ధి జాత శుక్రవారం తెనాలి చేరుకున్న సందర్భంగా స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక మార్కెట్ సెంటర్లో ప్రజలనుద్దేశించి సీపీఎం జిల్లా కార్యదర్శి యార్లగడ్డ నేతాజీ మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేకుంటే ప్రజాఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ప్రజలపై మోపిన విద్యుత్ భారాన్ని తగ్గించాలని కోరారు. ప్రపంచ బ్యాంక్ రాజధాని కాకుండా ప్రజల రాజధానిని నిర్మించాలని డిమాండ్ చేశారు. అప్పుగా కాకుండా కేంద్రం నుంచి హక్కుగా రావాల్సిన నిధులు తీసుకువచ్చి అమరావతి రాజధాని నిర్మాణం చేపట్టాలనీ, రాజధాని నిర్మాణ పనులను స్థానికులకే అప్పగించాలని కోరారు. ప్రభుత్వం ఏర్పడి ఆరుమాసాలు దాటినందున రైతులకు పంటలకు ఇస్తానన్న నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి గనులు కేటాయించి తక్షణమే ప్రైవేటీకరణ ఆపుతునట్టు స్పష్టమైన ప్రకటన చేయాలని చెప్పారు.

పార్టీ నాయకులు ఎం.భావనారాయణ ఎం.రవి, బూరగడ్డ వెంకటేశ్వరరావు, కొల్లిపర బాబుప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, గద్దె రవీందర్‌రావు, షేక్ హుస్సేన్ వలి, గండికోట వెంకట సుబ్బయ్య, బొనిగల సుబ్బారావు, ములకా శివ కుమారి పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి నాయకులు వెనుజుల సుబ్బారావు, నాగిరెడ్డి, రాజ్యలక్ష్మి, చల్లపల్లి కిన్నెర తదితరులు విప్లవ గీతాలు ఆలపించారు.

పట్టణ అభివృద్ధికి సహకరించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ రాధిక అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభం కావటం కొంత ఆలస్యం కావటంతో 33వ వార్డు కౌన్సిలర్ మొఘల్ ఆహ్మద్ కొంత అసహనం వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోయారు. అనంతరం ప్రారంభమైన సమావేశంలో అజెండాలోని నాలుగు అంశాలు చదివి ఆమోదించినట్లు ప్రకటించారు. చైర్‌పర్సన్ రాధిక మాట్లాడుతూ తెనాలి పట్టణానికి ఉన్న ఆర్థిక వనరుల ద్వారా అనేక అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. అయితే రోడ్లు, కాల్వల నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో కొందరు ఇళ్ల యజమానులు పని చేసేందుకు అవసరమైన నీటిని ఇచ్చేందుకు వెనకడుగు వేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలు ఇలాంటి విషయాలల్లో సహకరించాలని సూచించారు. వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు

గుంటూరు మెడికల్: జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రోడ్డు రవాణా శాఖ, గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల సంయుక్తంగా శుక్రవారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం జీజీహెచ్‌లో నిర్వహించారు. గుంటూరు జీజీహెచ్ ఎమర్జెన్సీ వార్డు వద్ద రోడ్ సేఫ్టీ కరపత్రాలు పంపిణీ చేసి ఆస్పత్రికి వచ్చే వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ చంద్ర రాధికా రాణి మాట్లాడుతూ యువత వాహనాలు నడిపేటప్పుడు అతి వేగం పనికిరాదన్నారు. ఆర్టీఓ మల్లీశ్వరి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని చెప్పారు. ఆర్టీవో గోపాల్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

మంత్రి అనగాని సత్యప్రసాద్



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: కేవలం విద్యాబుద్ధుల్ని అందించటమే కాకుండా సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించటంలో మోంట్‌ఫోర్ట్ విద్యా సంస్థలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మోంట్‌ఫోర్ట్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు డె.మోంట్‌ఫోర్ట్ జయంతి సందర్భంగా పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ స్కూలులో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని, తద్వారా చిన్నారులలో సేవా దృక్పథం అలవరిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. లాభార్జన దృష్టితో కాకుండా స్కూలు యాజమాన్యం సేవా కార్యక్రమాలు నిర్వహించటం మంచి పరిణామమని, మరిన్నిసేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. తొలుత మోంట్‌ఫోర్ట్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైద్యులు 470 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. 60 మంది దివ్యాంగులకు నిత్యావసర వస్తువులు అందించారు. అదే విధంగా పాఠశాల ఉపాధ్యాయులు, పట్టణానికి చెందిన పలువురు ప్రజలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, విజయవాడ మణిపాల్ వైద్యశాల వైద్యులు, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, ఫోకస్ ఐకేర్ హాస్పటల్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్: మోంట్‌ఫోర్ట్ స్కూలు ఆవరణలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు తాము తయారు చేసిన వంటకాలను ప్రదర్శించి తయారు చేసే విధానాన్ని వివరించారు. ఫుడ్ ఫెస్టివల్‌ను పలువురు సందర్శించి విద్యార్థులను అభినందించారు.

కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

కర్లపాలెం: కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మరాజు చెప్పారు. కర్లపాలెం కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం నాయకులు ఎమ్మెల్యే నరేంద్రవర్మను, ఏట్రవారిపాలెం సర్పంచ్ వెంకటలక్ష్మి దంపతులకు సన్మానం చేసి అమ్మవారి చిత్రపటాలను అందజేశారు.

పట్టణ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

రేపల్లె రూరల్: పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ కోరారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె మాట్లాడారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేశామన్నారు. నిరంతరం డ్రెయిన్‌లలో సిల్ట్‌ను, రహదారుల వెంబడి చెత్తను తొలగింప జేసేందుకు అధికారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి సమస్య నెలకొనే వార్డులలో ట్యాంకర్‌ల ద్వారా పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. అనంతరం అజెండాలోని 36 అంశాలలో పరిపాలనా పరమైన 15 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, ఏఈ రోహిణి, అధికారులు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దారుకు సన్మానం



సన్మానం చేసిన రెవెన్యూ సిబ్బంది

భట్టిప్రోలు(వేమూరు): డిప్యూటీ తహసీల్దారుగా పని చేస్తు తహసీల్దారుగా పదోన్నతి పొందిన గాదెలవర్తి నాగరాజుకు సన్మానం చేశారు. ఆయన భట్టిప్రోలు తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా పని చేస్తూ బాపట్ల జిల్లా కలెక్టర్లకు వ్యక్తిగత సహాయకులుగా పని చేసి ఇటీవల కారంచేడు మండలం తహసీల్దారుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మేక శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది శుక్రవారం ఘనంగా సత్కరించారు. తహసీల్దారు మాట్లాడుతూ గాదెవర్తి నాగరాజు భవిష్యత్‌లో ఎన్నో ఉన్నత పదవులు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీపీఎస్, ఈఏ జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్, వీఆర్వోలు శివరామకృష్ణ, కాశీ కృష్ణప్రసాద్, పుల్లయ్య, జక్కయ్య, సురేష్, కిరణ్ పాల్గొన్నారు.

కాపు ఒంటరి మహిళలకు అండగా కాపు సేవా సంఘం

అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు



మహిళలకు గ్రైండర్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేసిన కాపు సేవా సంఘం నాయకులు

బాపట్ల: కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో కాపు కులానికి చెందిన ఒంటరి మహిళలకు కుట్టు మిషన్లు, గ్రైండర్లు ఉచితంగా అందజేస్తున్నట్లు కాపు సేవా సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు అన్నారు. అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కల్యాణ మండపంలో కాపు కులానికి చెందిన ఒంటరి మహిళలకు గ్రైండర్లు, కుట్టు మిషన్లు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కాపు సేవా సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కాపు కులానికి చెందిన మహిళలకు ఆర్థిక సహాయంతో పాటు, కుట్టు మిషన్లు, గ్రైండర్లు అందజేస్తున్నామని, ఒక సంవత్సరం అందజేసిన వారికి మరొక సంవత్సరం అందజేయమని చెప్పారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి కాపు సేవా సంఘం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ సహాయ సహకారాలతో కాపు కులానికి చెందిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో కాపు నాయకులు పాల్గొన్నారు.

అభ్యసనం నిరంతర ప్రక్రియ

గుంటూరు రూరల్: అభ్యసనం నిరంతర ప్రక్రియగా ఉండాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్ర రావు తెలిపారు. చౌడవరంలోని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్ చేతన వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో కలసి గడిపినప్పుడు బంధాలు నిలబడతాయని తెలిపారు. ఆర్‌వీఆర్ – జేసీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడారు. పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను గుర్తించి వారిని ప్రోత్సహించాలని వ్యక్తపరిచారు. బాలకుటీరు వ్యవస్థాపకురాలు డాక్టర్ నన్నపనేని మంగాదేవి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని సక్రమంగా వినియోగించుకుంటూ, కాలాన్ని వృథా చేయకుండా ఉజ్వల భవిష్యత్తును అందిపుచ్చుకోవాలన్నారు. సీఏఓ దుర్గా రఘురామ్ మాట్లాడారు. కార్యక్రమానికి రావెల సాంబశివరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో చేతన కార్యనిర్వాహకురాలు మరుద్వతి, సహకార్యదర్శి జయశ్రీ, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎండీ నస్రీన్, మల్లికార్జున రావు, వెంకటేశ్వర్లు, డీన్ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.